క్లుప్తంగా

హాటకేశ్వరుని సన్నిధిలో మంత్రి ధర్మాన



కల్యాణోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సింగుపురంలోని హాటకేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈయనతో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

ఏసుప్రభువే రక్షకుడు



క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్ జోయల్

శ్రీకాకుళం కల్చరల్: ఏసుక్రీస్తే రక్షకుడిగా, రాజుగా జెరూసలెంలోకి ప్రవేశించిన రోజునే మట్టల ఆదివారంగా జరుపుకొంటారని పాస్టర్ జోయల్ సామ్ అన్నారు. స్థానిక డగ్లస్ స్కూల్‌లో ఉన్న కీస్టోన్ చర్చిలో మట్టల ఆదివారం సందర్భంగా క్రీస్తు సువార్తను వినిపించారు. జెరుసలేం వచ్చిన ఏసుకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తాటికొమ్మలు, అంగీలను ఉంచి రాజరికపు గౌరవాన్ని అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలొ చర్చి ప్రతినిధులు లిడియాజాన్, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాంలో నెల రోజుల గ్రామదేవత ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మరిడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 25 వరకు గ్రామదేవత పూజలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. పదేళ్లకోసారి ఈ పూజలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న మొయ్యి జనార్దనరావు

జి.సిగడాం: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ఈఏ మండల శాఖ అధ్యక్షుడు మొయ్యి జనార్దనరావు కోరారు. ఆదివారం జి.సిగడాంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర హామీని అమలు చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్ కొరికాన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అనురాగ నిలయానికి రూ.15 వేలు విరాళం



విరాళం అందిస్తున్న జ్యోతిప్రసాద్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతాకల్యాణ్ అనురాగ నిలయం, సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో అనాథ పిల్లలు, వృద్ధుల కోసం ఎం.వి.సి.జ్యోతిప్రసాద్ ఆదివారం రూ.15వేలు విరాళం అందించారు. యోగా రామారావు కుమారుడైన జ్యోతి ప్రసాద్ 8వ సారి ఈ విరాళం అందించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు తెలిపారు.

యువత రక్తదానం



రక్తదానం చేస్తున్న యువత

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని 80 అడుగుల రోడ్డులోని సీకేర్ మెడికల్ సెంటర్‌లో అశ్వ మారిటైన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 15 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందచేశారు.

మేలు చేసే ప్రభుత్వానికి మద్దతివ్వండి

- ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ సారథ్యంలో బహిరంగ సభ



రణస్థలం: మూడో విడత ఆసరా చెక్కును విడుదల చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మహిళలను ఆర్థిక శక్తివంతులుగా తీర్చిదిద్ది సంపూర్ణ సాధికారత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రణస్థలం మండలం జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కార్యక్రమం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో ఆదివారం జరిగింది. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు చెల్లించేందుకు జగన్‌మోహన్ రెడ్డి అప్పటి విపక్షనేత హోదాలో మాట ఇచ్చారని, దాని ప్రకారం ఆసరా సొమ్ము చెల్లిస్తున్నామని చెప్పారు. ఇవాళ ఇన్ని పథకాలు సమర్థంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమలవుతున్నాయంటే అందుకు 2019లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అధికారం ఇవ్వడమేనని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగాలంటే ఆ అధికారం మరోసారి ఇవ్వాలని కోరారు. మేలు చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: హాజరైన స్వయం సహాయక సంఘం మహిళలు

అర్హులందరికి సంక్షేమ పథకాలు: ఎంపీ బెల్లాన



నవరత్నాల పేరిట ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి మూడో విడతగా రూ.59 కోట్లు అందిస్తున్నామని చెప్పారు. నాడు–నేడు, విద్యాకానుక వంటి అద్భుత కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పేదల పక్షపాతి సీఎం జగన్: ఎమ్మెల్యే కిరణ్



పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పేద ప్రజల కోసం సీఎం జగన్ ఎంతవరకైనా వెళ్తారని, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు పట్టించుకోవద్దని చెప్పారు. లక్షా 65వేల శాశ్వత ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదని, అందుకే వారంతా విశాఖ కేంద్రంగా రాజధాని ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. అనంతరం రణస్థలం మండలానికి సంబంధించి 2040 పొదుపు సంఘాల్లోని 22,122 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా 3వ విడత ద్వారా రూ.18 కోట్ల లక్షా 49వేల 509 విలువైన చెక్కును మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, బల్లాడ హేమమాలిని రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎంపీపీ పిన్నింటి రజిని, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్ సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, రాయిపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, కరిమజ్జి భాస్కరరావు, పిల్లా ఆనందరావు పాత్రుడు, మహంతి చినరామినాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, గొర్లె అప్పలనర్సునాయుడు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, మండల ప్రత్యేకాధికారి బీహెచ్ దుర్గారావు, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపీడీఓ ధనుంజయరావు, ఏపీఎం వెంకటరత్నం, సర్పంచులు, ఎంపీటీసీలు, వెలుగు సీసీలు, సీఎఫ్‌లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలో ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలంలోని 26 పంచాయతీలకు సంబంధించి 22437 స్వయం సహాయక సంఘాలకు రూ.17.48 కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందని. వైఎస్సార్ జగనన్న ఇళ్లు, సున్నా వడ్డీ రుణాలు, చేయూత రుణాలు, స్త్రీనిధి రుణాలు ఇలా మహిళలు కోసం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ స్వయం సహాయ సంఘాలను రుణమాఫీ హామీతో మోసం చేసిందని, పసుపు కుంకుమ అంటూ అరకొర సాయంతో సరిపెట్టిందని చెప్పారు. ప్రతి మహిళా రానున్న ఎన్నికల్లో ఓటు వేసి జనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.సత్యనారాయణ, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, వెలుగు ఏపీఎం రామ్మూర్తి, జెడ్పీటీసీ, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షురాలు బల్లాడ హేమమాలినీ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరుగుళ్ల విజయకుమారి, నాయకులు, ప్రజాప్రతినిధులు జరుగుళ్ల శంకరరావు, సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, కె.వి.వి. సత్యనారాయణ, మాడుగుల మురళీధర్ బాబా, మూగి శ్రీరాములు పాల్గొన్నారు.



ఎచ్చెర్లలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ప్రభుత్వంలో రెవెన్యూ విభాగం కీలకం



మంత్రి ధర్మాన ప్రసాదరావును సన్మానిస్తున్న విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు

- విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల భవనం ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వంలో రెవెన్యూ విభాగం కీలకమని, దీనిని మదర్ డిపార్ట్‌మెంట్ అంటారని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పాత శ్రీకాకుళంలో నూతనంగా నిర్మించిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల కార్యాలయ భవనాన్ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల సంఘం చాలా ఏళ్లుగా సంబంధిత సమస్యలపై పనిచేస్తున్నారన్నారు. కష్టకాలంలో సమాజానికి అండగా ఉంటున్నారని కొనియాడారు. రెవెన్యూ ఉద్యోగులు సంఘ సేవ చేయడంలో ముందుంటారన్నారు. అనేక మంది 30, 40 ఏళ్ల పాటు పనిచేస్తుంటారని, ఆ అనుభవం జీవిత కాలం పాటూ ఉంటుందన్నారు. ఈ శాఖ లేకుండా ప్రభుత్వాల్ని ఊహించలేమన్నారు. బ్రిటీష్ కాలంలో భూసర్వే నిర్వహించారని, ఆ తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే సర్వే నిర్వహించడం పరిపాలనా దక్షతకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక వివాదాలకు కారణం భూ వివాదాలేనని చెప్పారు. ఇనాం భూముల విషయమై క్లెయిమ్ చేసేందుకు వీల్లేని భూములను మళ్లీ దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేలా మార్పులు చేస్తున్నామన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండా, అనుమానం వస్తే రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం కూడా ఇచ్చామన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో కూడా కొన్ని నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ప్రొహిబిషన్ ట్రాన్స్‌ఫార్మేషన్ అన్నది ఒకప్పుడు ఉండేది కాదని, ఇందుకు సంబంధించిన వివాదాలు పరిష్కరించేందుకు ఓ కమిటీ వివిధ రాష్ట్రాలలో అధ్యయనం చేసిందన్నారు. కమిటీ తుది నివేదిక ఈ నెల 6న ఇవ్వనుందని తెలిపారు. వివాదాలకు తావు లేకుండా భూ వినియోగం గానీ రిజిస్ట్రేషన్ గానీ ఉండాలన్న ఉద్దేశంతో పీఓటీ యాక్ట్‌ను సవరించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రజనీకాంతారావు, ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం,తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, సీతారామ్మూర్తి, డీపీ దేవ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుల్లో కలవరం

జి.సిగడాం: అకాల వర్షం మొక్కజొన్న రైతులను కలవరపాటుకు గురిచేసింది. ఆదివారం కురిసిన వర్షానికి మండలంలో పలుచోట్ల ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు తడిచిపోయాయి. పంట చేతికొస్తున్న సమయంలో వర్షాలు కురవడంతో నష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జి.సిగడాం మండల పరిధిలో పాలఖండ్యాం, మెట్టవలస, జి.సిగడాం, గేదెలపేట, బాతువ, సీతంపేట, నడిమివలస జాడ, ముషినివలస, చంద్రయ్యపేట, వెలగాడ తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.



నడిమివలస రోడ్డులో మొక్కజొన్న పంటను రక్షించుకుంటున్న రైతు

సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కిరణ్ తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్యాభివృద్ధిలో శ్రీశ్రీ కళావేదిక సేవలు అభినందనీయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తిరుపతిలో జరగనున్న సాహితీ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రణస్థలంలో మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కిరణ్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆవిష్కరించారు. మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తూ సాహిత్యంపై మక్కువతో రచనలు చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మోజీని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించడం శుభపరిణామమన్నారు. అనంతరం అమ్మోజీ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో సాహితీ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే 2వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కళాకారులందరికీ ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.రజనీసాయికుమార్, జెడ్పీటీసీ టి.సీతారాం, ఎంపీడీఓ ధనుంజయరావు, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా చౌదరి రవీంద్ర



శ్రీకాకుళం న్యూకాలనీ: యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన చౌదరి రవీంద్ర ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన 48వ రాష్ట్ర యూటీఎఫ్ కౌన్సిల్‌లో ఈయన వరుసగా మూడోసారి కార్యదర్శిగా ఎన్నుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సంపతిరావు కిషోర్‌కుమార్, పొందూరు అప్పారావు, ఆర్.దమయంతి, వై.ఉమాశంకర్ ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నానుబాలు వీధిలోని చెస్ కోచింగ్ సెంటర్లో అండర్–17 జిల్లాస్థాయి చెస్ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సనపల భీమారావు ఆదివారం ప్రారంభించారు. పలాసకు చెందిన కె.కల్పక్ ప్రథమ స్థానం సాధించగా ఆరంగి మేఘన, సందేశ్ కుమార్, బగాది కార్తికేయ తర్వాత స్థానాల్లో నిలిచారు. వీరంతా ఈ నెల 21న నర్సీపట్నంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

విద్యార్థులకు నీతి కథల పోటీలు



విద్యార్థుకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు నీతికథల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు కథలను చక్కగా చదివి వినిపించారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, నిక్కు హరిసత్యనారాయణ, నటుకుల మోహన్, జగన్నాథంనాయుడు, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ఉషా రత్నకుమారి ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లావేరులో దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

లావేరు: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా లావేరు రామాలయం వద్ద ఆదివారం దీపారాధన నిర్వహించారు. గ్రామ మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు. అనంతరం భజనలు చేశారు. దీపారాధన వల్ల కలిగే ఉపయోగాలను అర్చకులు బి.ఉమాశంకరశర్మ తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్షర సేద్యంతో సామాజిక చైతన్యం



కవులను సత్కరిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రచయితల సాహిత్య సేవలన్నీ సామాజిక చైతన్యం దిశగా ఉంటాయని సెట్‌శ్రీ విశ్రాంత సీఈఓ సురంగి మోహనరావు అన్నారు. నగరంలోని శాంతినికేతన్ కళాశాల ఆవరణలో ఆదివారం తెలుగు రచయితల వేదిక 79వ సమావేశం నిర్వహించారు. తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి కార్యదర్శి నివేదిక సమర్పించారు. అనంతరం పలువురు కవితలను చదివారు. వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలాసకు చెందిన సాహితీవేత్త లయన్ తెప్పల కృష్ణమూర్తి, ఎస్.ఎథస్, కోఆర్డినేటర్ పూడి జనార్దనరావు పాల్గొన్నారు.

దళిత మహాసభ నూతన కార్యవర్గ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన దళిత మహాసభ నూతన కార్యవర్గం

లావేరు: ఏపీ దళిత మహాసభ లావేరు మండల నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం సుభద్రాపురం వద్ద ఏకగ్రీవంగా జరిగాయని మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దేబారికి రాము తెలిపారు. సంఘ మండల శాఖ అధ్యక్షుడిగా తలే కమల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా గుడివాడ అప్పలరాజు, జాయింట్ సెక్రటరీలుగా నేదురు జగదీష్, లింగాల నర్సయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యాగాటి శంకరరావు, కోశాధికారిగా నేదరు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా బత్తిన రాము, వర్కింగ్ సెక్రటరీగా కొర్రాన సూరీరాములు, జిల్లా ఉపాధ్యక్షుడిగా లావేటి అసిరప్పడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల ఆదినారాయణ, మహిళా ప్రతినిధులుగా నేదురు నాగమ్మ, బోనేల అప్పమ్మ, కార్యవర్గ సభ్యులుగా యాగాటి రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ దళిత మహాసభ ఎచ్చెర్ల గౌరవ అధ్యక్షుడు నిడిగంట్ల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడి కుటుంబానికి పరామర్శ



చిన్నారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కుందువానిపేటకు చెందిన మత్స్యకారుడు మైలపల్లి చిన్నారావు ఇటీవల విశాఖపట్నంలో మరబోటులో చేపలవేట సాగిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ కుటుంబాన్ని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, సర్పంచ్ సూరాడ సూర్యం ఆదివారం పరామర్శించారు. వైఎస్సార్ మత్స్యకార బీమా మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని మంత్రులు ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ సీదిరి అప్పలరాజుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలపల్లి పోలీసు, సూరాడ రామారావు, లక్ష్మణరావు, బర్రె చిన్నారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు



మంత్రి ధర్మానను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: ఇటీవల ఎన్నికైన జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు ఆదివారం మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు బార్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, చౌదరి లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు. వీరందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్త, అత్త, వారి కుటుంబ సభ్యులపై పట్టణంలోని గోల్కొండ రేవుకు చెందిన యువతి ఫిర్యాదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. గోల్కొండ రేవుకు చెందిన యువతికి సాలూరుకు చెందిన కళింగపట్నం ఈశ్వరరావు (ఆర్టీసీ డ్రైవర్)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. అప్పటి నుంచి భర్త, అత్త వేధింపులపై సాలూరు పోలీసు స్టేషన్, సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్, శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా మార్పు రాలేదని, మళ్లీ శారీరక దాడులకు పాల్పడటమే కాక ఇద్దరు కుమార్తెలను చంపేస్తారేమోనన్న భయంతో ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

4 నుంచి జిల్లాస్థాయి ఆహ్వాన కబడ్డీ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం రూరల్ మండలం భైరి సింగుపురంలో ఈ నెల 4 నుంచి 6 వరకు జిల్లాస్థాయి ఆహ్వానిత పురుషుల కబడ్డీ పోటీలు జరుగుతాయని జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి సాధు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగుపురం క్రీడామైదానం వేదికగా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 96422 87746 నంబర్‌ను సంప్రదించాలన్నారు.